# నిలువలేని నీరు

ఆచంట శారదాదేవి



కథ

'అన్నయ్య నిన్ను రమ్మన్నాడు.'

అదీ ప్రొద్దున్నే వచ్చి గంగారామ్ చెప్పిన వార్త. అతను వాణీపతి పినతండ్రి కొడుకు. ఎప్పుడైనా ఆ ఊరు వెళితే అక్కడి వార్తలు చెప్పి పోతుంటాడు.

ఆ మాట వినగానే ధరణి గుండె ఝుల్లుమన్నది. ఆమెకు కళ్ళనీళ్ళు వచ్చాయి. అకాలంలో కురిసిన వర్షంలా ఆ మాట ఆశ్చర్యము, ఆనందము, విషాదము కలిగించింది. పదేళ్ళయింది! వాణీపతి ఆమె ముఖం చూచి! ఎప్పుడో ఒకప్పుడు అతని మనస్సు మారుతుందేమోనన్న ఆశ కూడా ఏనాడో పోయింది. ఈ జన్మలో అతను ఎప్పుడైనా ఒక్కక్షణం కనిపిస్తాడని కూడ అనుకోలేదు. అతను ఆమెకు ఎప్పుడూ సన్నిహితంగా లేడు. ఎప్పుడూ దూరంగానూ లేడు. ప్రతిక్షణం కంటికి కనిపిస్తూనే ఉన్నాడు. ప్రతిక్షణం మనసులో మెదులుతూనే ఉన్నాడు. అయినా అతను ఆమెకు లేడు. మనస్సుని ఆక్రమించుకుని వదలని ప్రియుడు, కట్టుకున్న భర్త ఇలా దూరంగా పరాయివాడుగా ఉండటం మనస్సుకు చిత్రవధ! అయినా ఈ పరిస్థితికి ఆమె అలవాటు పడింది. ఇది మారుతుందని అనుకోలేదు. మారాలని కోరుకోలేదు. నిలువలేని అనురక్తి తనకు, మార్పులేని విరక్తి అతనికి, రెండూ సహజమే! బాధపడి, నిందించి ప్రయోజనంలేదు అనుకునేది.

ఇప్పుడు వాణీపతి రమ్మన్నాడన్న వార్త అకస్మికంగా ఆమెలో రకరకాల భావాలు రేపింది. అతను తనను మరచిపోలేదేమో, మనసు మారిందేమో అని ఆశ! మళ్ళా అతన్ని చూస్తాను గదా అని ఆనందము! అపురూపమైన ఆపిలుపు వినగానే పరిగెత్తి పోవాలన్న ఆతురత! ఆ సంచలనానికి తట్టుకోలేక ఆమె కంపించింది. ఎంత దైన్యము! ఎంత దౌర్భాగ్యము! అని మనసు కుమిలింది. కాస్సేపటికి తేరుకుంది.

ప్రొద్దున గంగారామ్ వచ్చినప్పుడు ఎవరూ లేరు. సుమలత కాలేజికి వెళ్ళింది. రామేశం ఎప్పుడూ మేడదిగిరాడు. ముడంతస్తుల మేడలో ఎప్పుడూ ధరణి ఒకత్తే ఏకాంతంగా కాలం గడుపుతూ ఉంటుంది. నౌకర్లు ఎప్పుడూ పెరటివేపున ఉంటారు. తండ్రి రామేశం ఉద్యోగం విరమించి చాలా రోజులైంది. ఆమధ్య ఒకరోజు ఆయనకు గుండెపోటు వచ్చింది. అప్పటినుంచి ఆయన గది విడచి బయటికిరాడు. ధరణి తానే వెళ్ళి కాస్సేపు కబుర్లు చెపుతుంది. చెల్లెలు సుమలత చాలాకాలం విదేశాల్లోనే ఉంది, చదువుకోసం! తిరిగి వచ్చాక ఇక్కడ కళాశాలలో పని చేస్తోంది. పెళ్ళి చేసుకోలేదు. ఆమెకు ధరణిమీద విపరీతమైన ప్రేమ! ఆమె జీవితం పాడుచేశాడని వాణీపతిమీద విపరీతమైన కోపం! ధరణిమీద జాలితో, ఆమెకు తోడుగా ఉండాలన్న ఊహతో సుమలత పెళ్ళిమాట తలపెట్టలేదు. ఆమెకు ఎవరిమీదా మమకారమూ కలుగలేదు. కళాశాల, పిల్లలు, చదువూ, పుస్తకాలూ – ఇవి తప్ప మనస్సులో మరొక ఆలోచనకు చోటులేదు. ఉదయం వెళితే సాయంత్రం వస్తుంది. వచ్చాక తోటలో కాస్సేపు ధరణితో మాట్లాడుతూ ఉంటుంది – అది ఒక బాధ్యతలా! తరువాత తన గదికి వెళుతుంది. రాత్రి చాలాసేపు చదువుకుంటూ ఉంటుంది.

ధరణి ఇన్నాళ్ళైనా వాణీపతిమీద మమకారాన్ని వదలకపోవడం ఆమెకు

చిరాకు. వాణీపతి హృదయం లేనివాడు, కృతజ్ఞతలేనివాడు' అంటుంది. అతను రాయక పోయినా ధరణి ఉత్తరాలు రాయడం, అతను కోరకపోయినా ధరణి ఏవో కొని పంపడం ఆమెకు ఇష్టం ఉండదు. అయినా ధరణి చెపితే వినదు. అంచేత ఉపేక్షగా ఊరుకుంటుంది.

ఇంట్లో అన్నీ ధరణి చూస్తుంది. అయినా ఇంచుమించు రోజంతా తీరికే! ఎవరూ తోడు ఉండరు. ఆమె చిన్నప్పుడు సితార్ నేర్చుకుంది. కాస్సేపు దాన్ని వాయించుకుంటూనో, కాలక్షేపానికి దాన్ని తుడుచుకుంటూనో ఉంటుంది. అది దగ్గర ఉంటే మరొక ప్రాణి దగ్గర ఉన్నట్లే ఉంటుంది. తనకు చాలా ఇష్టమైన పాటలన్నీ వాణీపతికి వినిపించాలన్నది ఆమె ఫలించని అనంతమైన ఆశలలో ఒకటి! చిన్నప్పుడు ఎన్నోసార్లు కొంచెం జంకుతో, కొంచెం ఉత్సాహంతో అతన్ని అడుగుతూ ఉండేది, 'సితార్ వాయించనా?' అని. అతను ఎప్పుడూ మాట తప్పించి వెళ్ళిపోయేవాడు. అతనికి సన్నిహితంగా ఉండాలని ఆమె తాపత్రయం! ఆమెకు దూరంగా ఉండాలని అతని తాపత్రయం! సితార్ తీగలు సవరించినప్పుడల్లా అది గుర్తుకువచ్చి ఆమె కళ్ళు నిండేవి.

వాణీపతి ధరణికి మేనత్త కొడుకు. అతనికి తల్లి లేదు. తండ్రి మళ్ళా పెళ్ళి చేసుకోలేదు. ఆయనకు మళ్ళా ఇంకో భార్యను సంసారాన్ని పోషించే శక్తి లేదు. సంపాదన తక్కువ. వాణీపతి చిన్నప్పటి నుంచి మంచి ప్రయోజకుడు. బ్రతుకు తెరువు తెలిసినవాడు. చొరవగా నలుగురిలో కలసి తిరుగగలడు. తనకు కావలసినవి సంపాదించుకోగలడు. ధనవంతుడైన మేనమామ తనకు అన్ని విధాల అండగా ఉంటాడన్న సంగతి అతను మరచిపోలేదు. ప్రతి సెలవలకు తప్పకుండా మేనమామ ఇంటికి వెళ్ళేవాడు. అక్కడే ఉండేవాడు. చిన్నతనం నుంచి ధరణికి వాణీపతి అంటే విపరీతమైన వ్యామోహం! చంద్రుని రాకకు కలువ పువ్వులా ప్రతి సెలవలకు అతని కోసం ఎదురు చూసేది. అతను ఉన్నన్నాళ్ళు సంతోషంగా ఉండేది. వాణీపతికి ఆమె వ్యామోహం వెటకారంగా ఉండేది. అయినా ఆమె అమాయకత్వాన్ని అనురాగాన్ని అతను వినియోగించుకున్నాడు. సెలవల్లో అతని మనసు విపరీతంగా విలాసాలమీద, వినోదాలమీద ప్రసరించేది. తండ్రికి తెలిసీ, తెలియక ధరణి వాణీపతికి కావలసిన డబ్బు ఇచ్చేది. వెళ్ళిపోయ్యేటప్పుడు తండ్రి తనకు ప్రియంగా ఇచ్చిన వస్తువులన్నీ ఇచ్చి పంపేది. సెలవల్లో ఎప్పుడూ అతనికి ఊరుచుట్టూ తిరగడమే సరిపొయ్యేది. ఎంత పరితపించినా ఎప్పుడూ ధరణికి దగ్గరగా చనువుగా ఉండేవాడు కాదు. అతనికి ఆమెమీద వ్యామోహము కలగలేదు.

పెళ్ళి ప్రసక్తి వచ్చినప్పుడు ధరణి ధైర్యంగా స్పష్టంగా తండ్రితో చెప్పింది, 'బావను తప్ప ఇంకెవరినీ పెళ్ళిచేసుకోను' అని. రామేశం వాణీపతి ఊరు వెళ్ళాడు, పెళ్ళి మాటలు జరిపి ముహూర్తం పెట్టుకోటానికి! వాణీపతి పెళ్ళికి ఒప్పుకోలేదు. ధరణిమీద తనకు ఆసక్తి లేదని స్పష్టంగా చెప్పాడు. రామేశం చిన్నబుచ్చుకున్నాడు. అక్కడ ఉన్న ఒకటి రెండు రోజుల్లో ఆయన వాణీపతిని గురించి మంచీ చెడూ చాలా విన్నాడు. ఒక విధంగా ఈ సంబంధం తప్పిపోవటమే మంచిదనుకున్నాడు. సంతృప్తిగా తిరిగి వచ్చాడు.

ధరణి సంగతి విని క్రుంగిపోయింది రామేశం ఆమెను ఓదార్చాడు. ఆమె మనస్సు మార్చాలని, ఊరట కలిగించాలనీ ఆత్రుతతో అన్నాడు 'అమ్మా! బాధపడకు. అతనికి చాలా రోజులుగా వాళ్ళ ఇంట్లో ఉన్న వంద అనే అమ్మాయితో స్నేహం ఉందట. ఆపిల్ల అతని కన్నా ఒక ఏడాది పెద్దదిటకూడా! అయినా ఆ పిల్లనే చేసుకోవాలనుకుంటున్నాడట! వాళ్ళనాన్నే చెప్పాడు. ఇంకా ఊళ్ళో వాళ్ళూ చెప్పారు. అతని ప్రవర్తన ఏమంత మంచిదికాదట.



ఒక విధంగా ఇదంతా మన మంచికే అనుకోవాలి" అని.

ధరణి ఆ మాటలు వినిపించుకోలేదు. ఆ రాత్రి అంతా కుమిలికుమిలి ఏడ్చింది. తెల్లవారాక ఆమె మనస్సు ఏమీ మారలేదు. మళ్ళా ఇంకోసారి తండ్రితో స్పష్టంగా చెప్పింది "పెళ్లి చేసుకుంటే బావనే చేసుకుంటాను, లేకపోతే లేదు" అని. ధరణి కోరినచాలు రామేశం ఏళ్ళూళ్ళనుంచి ఏంకావాలన్నా క్షణంలో తెచ్చేస్తాడు. ఇంక వాణీపతి లెఖ్ఖేమిటి! డబ్బుతో కొనలేనిదేముంటుంది అనుకున్నాడు. వాణీపతికి మళ్ళా ఒక ఉత్తరం రాశాడు. "నీవు విదేశాలకు వెళ్ళి చదువుకోవాలనుకుంటున్నావు గదా! ధరణిని పెళ్ళి చేసుకుంటే నీ చదువు ఖర్చులన్నీ నేను భరిస్తాను, ఆలోచించుకో" అని.

వాణీపతి ఆలోచించుకున్నాడు. విదేశాలకు వెళ్ళి డిగ్రీలు తెచ్చుకుంటే మంచిఉద్యోగం దొరుకుతుంది. హోదా పెరుగుతుంది. బ్రతికినన్నాళ్ళు సుఖంగా గడుస్తుంది. కాకపోతే ఏ మారుమూలో ఏదో చిన్న ఉద్యోగంలో ఎన్నాళ్ళు బాధపడతాడు! అతను వరదమీద అనురాగానికి తాత్కాలికంగా కామా పెట్టుకున్నాడు. ధరణిని పెళ్ళిచేసుకున్నాడు. మర్నాడే ఓడఎక్కి వెళ్ళిపోయాడు.

ధరణి సంతోషంతో ఉప్పొంగిపోయింది. డబ్బిచ్చి అయినా అతనిని కొనుక్కోగలిగినందుకు! ఇంక బావ తనను వదలి ఎక్కడికిపోడు. ఎప్పుడూ తన ఎదటే ఉంటాడు, విదేశాన్నుంచి రాగానే ఇంక ఒక్క క్షణమైనా తాను అతనికిదూరంగా ఉండదు, అని సంతోషపడింది. కాలం గడిచింది.

వాణీపతి అమెరికానుంచి ఎప్పుడు తిరిగి వచ్చాడో ఎవరికీ తెలియదు. వచ్చేముందు అతను ఉత్తరం రాయలేదు. రాగానే ఎక్కడో దూరాన ఉద్యోగంలో చేరాడు. అప్పుడు రాశాడు. అదీ ధరణికి! "నేను ఇక్కడ ఉద్యోగంలో చేరానని నీకీ పాటికి తెలిసి ఉంటుంది. నాకు నీ మీద మమకారం లేదు అది నీకు తెలుసును. నేను వందను పెళ్ళి చేసుకుంటున్నాను. నీకూ నాకూ ఎటువంటి సంబంధము లేదని, ఈ పెళ్ళికి నీకు ఎటువంటి అభ్యంతరము లేదని నా కొక కాగితం రాసి ఇస్తే చాలు, సంతోషిస్తాను. ఇది చేయక తప్పదు" అ అమెరికానుంచి రాగానే అతను ధరణికి అప్యాయంగా రాసిన ఉత్తరం. ఆ ఉత్తరం చూచి రామేశం మండి పడ్డాడు. "కృతఘ్నుడు. ఇతన్ని అన్ని కోర్టులు తిప్పుతానుగాని సులభంగా వదులుతానా" అని కచ్చతో అన్నాడు. కాని ధరణి అది ఏమీ సాగనివ్వలేదు. రెండు మూడు రోజులు విపరీతంగా దుఃఖపడి తరువాత మెల్లగా తేరుకుంది. వాణీపతికి ఉత్తరం రాసింది. "నీకు కావలసినది ఇవ్వడానికి అభ్యంతరంలేదు. నీవు స్వయంగా వచ్చి నా కొక్కసారి కనిపించి నీకు కావలసినది తీసుకువెళ్ళు. అయినా ఒక్క కాగితంతో, నీతో నాకు సంబంధం తెగిపోతుందని నాకేమీ నమ్మకం కలగటం లేదు" అని.

ఆ తరువాత అతను వచ్చాడు. కాగితం సంతకం చేయించి తీసుకున్నాడు. ఆమె జీవితంలోనుంచి నిష్క్రమించాడు. మళ్లా ఇంతవరకు ఎప్పుడూ వెనక్కు తిరిగి చూడలేదు.

ధరణి మాత్రం అతనిని వదలలేదు. తానెప్పుడు అతనికి ఏమీ కాదని పరాయిదని ఆమెకు ఎప్పుడూ స్ఫురణ కలగలేదు. అతని మీద ఎప్పుడూ కోపమూ రాలేదు. అతను తిరిగి చూడక పోయినా తాను అతనికి చెందిన వ్యక్తి అనే అనుకుంది. ఎప్పుడో ఏమీ తోచక ఉత్తరం రాస్తుంది! ఏదో తపనతో ఏవో కొని పంపుతుంది. ఈ మమకారం ఇంకా నశించలేదని అమాయకంగా గుర్తు చేస్తుంది. మళ్లా అతని సుఖానికి తాను అడ్డు కాకూడదు. అతనినీ వేధించకూడదను అనుకుంటుంది. ఉదాసీనంగా ఊరుకుంటుంది. అలాగే మెల్లగా రోజులు దాటిపోతున్నాయి.

★ ★ ★

ఆవేళ సాయంత్రం తోటలో కూర్చున్నప్పుడు ధరణి సుమలతతో చెప్పింది. "బావ రమ్మన్నాడుట. ప్రొద్దున గంగారామ్ వచ్చి చెప్పాడు" అని. సుమలత బాధ పడింది. చాలా సేపు మాట్లాడలేదు. తరువాత మెల్లగా అన్నది. "ఎందుకు రమ్మన్నాడో కనుక్కున్నావా?" అని. "లేదు" అన్నదిధరణి. సుమలత మెల్లగా చెప్పింది. "నేను కనుక్కున్నాను. సాయంత్రం నాకూ కనిపించాడు గంగారామ్. ఇన్నాళ్ళకు ఇప్పుడు వంద గర్భిణితో ఉన్నదట! ఆమెకు ఆరోగ్యం బాగుండలేదు. ఇంట్లో ఎవరూ తోడులేరు. నీవు వస్తే ఆమెకు తోడుగా ఉంటావు. పైగా నీతో నీ నౌకర్లు కూడా వస్తారు. వందకు అన్నివిధాల సౌకర్యంగా ఉంటుంది. అదీ బావ పిలుపుకు అర్థం! అతని అక్కర తీరగానే మళ్ళా నీ త్రోవన నిన్ను వెళ్ళమంటాడు" అన్నది బాధగా.

ధరణికి కళ్ళు చెమ్మగిల్లాయి. కాస్సేపు ఊరుకుంది. మళ్ళా మెల్లగా అన్నది "పోనీ, కారణాలు ఏమైతేనేం! ఇన్నాళ్ళకు రమ్మని పిలిచాడు గదా! వెళతాను. అతనికి అవసరమైనప్పుడైనా నన్ను తలుచుకున్నాడు. అంతే చాలు!" అని.

సుమలతకు జాలిముంచుకు వచ్చింది. ధరణిని ఆపటానికి ప్రయత్నించి లాభం లేదు. ఆమె ఆగదు. పల్లానికి ప్రాకేనీరు బలవంతంగా పట్టుకుంటే నిలువదు.

ఆమె—ధరణి ముఖం కేసి చూసింది. అప్పుడే వెన్నెల తోటంతా కమ్ముకుంది. ఆ వెన్నెట్లో ధరణి పసిపాపలా అమాయకంగా కనిపించింది. ఎంతైనా మనస్సులో మమకారం మాసిపోదేమో అనుకున్నది సుమలత వింతగా!

□□□